సాక్షి ఖమ్మం

సోమవారం । 28 । ఏప్రిల్ । 2025



పాడి వృద్ధి.. పాలు సమృద్ధి..

ఇప్పటికే వ్యవసాయ రంగ అభివృద్ధికి కృషి చేస్తున్న డీసీసీబీ.. రైతుల కోసం పాడి పరిశ్రమకూ ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించింది. 8లో



దళారులకు అండగా..

పత్తి సాగు చేసిన రైతులకు అండగా నిలిచేందుకు సీసీఐ కొనుగోళ్లు చేపట్టగా.. తాత్కాలిక రిజిస్ట్రేషన్ల జారీలో అక్రమాలు జరిగినట్లు తేలింది. 8లో

గరిష్టం / కనిష్టం
40° / 25°

వాతావరణం

జిల్లాలో సోమవారం అధిక ఉష్ణోగ్రత నమోదవుతుంది. మధ్యాహ్నానికి ఎండ తీవ్రమవుతుంది. కొన్నిచోట్ల సాయంత్రం చిరు జల్లులు పడొచ్చు.

ముందు జాగ్రత్తే మందు



ఉదయం ఏడు గంటలు దాటేలోగా సూర్య ప్రతాపం మొదలవుతోంది. ఆ తర్వాత గంటగంటకూ ఉష్ణోగ్రత పెరుగుతూ మధ్యాహ్నం పతాకస్థాయికి చేరుతోంది. ఉష్ణోగ్రత 40 డిగ్రీలు దాటుతుండడంతో జనం బయటకెళ్లాలంటే జంకుతున్నారు. ఈ పరిస్థితి మే నెలకల్లా మరింత తీవ్రమయ్యే అవకాశముంది. ఈ నేపథ్యాన పిల్లలు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారి ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరముంది. అంతేకాక మూగజీవాలు, మొక్కలనూ కాపాడుకోకపోతే ఎండాకాలం ముగిసేలోగా అవి దూరమయ్యే ప్రమాదం పొంచి ఉంది. ఈ మేరకు వివిధ వర్గాల ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పెంపుడు జంతువులు, ఇళ్లలో పెంచుకునే మొక్కల సంరక్షణపై నిపుణుల ఇచ్చిన సలహాలు, సూచనలతో కథనం..

– ఖమ్మం వ్యవసాయం / ఖమ్మం గాంధీ చౌక్ / ఖమ్మం వైద్యవిభాగం

ఎండ, అల్ట్రా వైలెట్ కిరణాలతో చెడు ప్రభావం



కె.రవికుమార్

ఉమ్మడి జిల్లాలో 41–44 డిగ్రీల మేర ఉష్ణోగ్రతకు తోడు అల్ట్రా వైలెట్ కిరణాలు, వడగాలులు శరీరంపై చెడు ప్రభావం చూపే అవకాశం ఉంది. వివిధ వృత్తులు చేసేవారు, రైతులు, వ్యవసాయ కూలీలు తీసుకోవాల్సి న జాగ్రత్తలను వైరా కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ కె.రవి కుమార్ వివరించారు.

- వీలైనంత వరకు వ్యవసాయ పనులను ఉదయం లేదా సాయంత్రం చేసుకోవాలి. తప్పనిసరై మధ్యాహ్నం చేయాల్సి వస్తే తలపై ఎండ పడకుండా టోపీ, గొడుగు ధరించాలి. నీరు చెమట రూపంలో బయటకు వెళ్లనున్నందున నీరు, మజ్జిగ, కొబ్బరినీళ్లు తాగాలి. రైతులు పశువులు, గొర్రెలు, మేకలను మేతకు తీసుకెళ్లినప్పుడు నీడ పట్టున చెట్ల కింద సేద తీరేలా చూడాలి.

మూగజీవాలు జాగ్రత్త



డాక్టర్ కె.వెంకటనారాయణ

అధిక ఉష్ణోగ్రతల కారణంగా పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్లు వడదెబ్బ బారిన పడకుండా తగిన యాజమాన్య పద్ధతులను పాటిస్తే ఉత్పాదక శక్తిని రక్షించినట్లవుతుందని జిల్లా పశువైద్య, పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కె.వెంకటనారాయణ తెలిపారు. ఈమేరకు ఆయన ఇచ్చిన సూచనలిలా..

- అధిక వేడి, గాలి ప్రసరణ సరిగా లేకపోవటం, షెడ్లలో కిక్కిరిసి ఉంచడం, నీటి సౌకర్యం సరిగ్గా లేక పశువులు, జీవాలు వడదెబ్బకు గురవుతాయి. తద్వారా నీరసమై జీర్ణక్రియ తగ్గి ఆకలి మందగించి ఉత్పత్తి పడిపోతుంది. అంతేకాక వ్యాధి నిరోధక శక్తి తగ్గి, చూడి పశువులకు గర్భస్రావమయ్యే ప్రమాదముంది. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకుని పిండి పదార్థాలు గంజి, జావ వంటివి పశువులకు ఆహారంగా ఇవ్వాలి. ఉదయం, సాయంత్రం పచ్చిగడ్డి, రాత్రికి ఎండుగడ్డి ఇవ్వాలి. పాడి పశువులకు దాణాను నీటితో కలిపి ఇవ్వాలి. మినరల్ మిక్చర్, ఉప్పు కలిపిన ద్రావణం ఇవ్వటం మంచిది. మేతకు ఉదయం, సాయంత్రమే తీసుకెళ్లాలి. వ్యాధులు దరిచేరకుండా గొంతువాపు, జబ్బవాపు వంటి వ్యాక్సిన్లు వేయించాలి. పశువులకు మంచి, చల్లని నీరు అందుబాటులో ఉంచాలి. వడదెబ్బకు గురైన పశువులను చల్లని గాలివచ్చే ప్రదేశంలోకి చేర్చి శరీర ఉష్ణోగ్రత తగ్గేలా పలుసార్లు నీటితో కడగాలి. తల, నుదుటిపై చల్లని గోనె సంచి కప్పాలి. ఆపై పశువైద్యులను సంప్రదించాలి.

తేమ, నీడతో మిద్దె, పెరటి తోటల రక్షణ





ఎం.వీ.మధుసూదన్

ఉష్ణోగ్రతలు పెరిగిన నేపథ్యాన మిద్దె తోటలు, పెరటి తోటల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి ఎంవీ.మధుసూదన్ సూచిస్తున్నారు. తోటల నిర్వాహకులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇలా ఉన్నాయి.

- తెల్లవారుజాము, సూర్యాస్తమయ సమయాల్లో తోటలకు నీరు పెట్టాలి. మధ్యాహ్నం నీరు పెడితే ఎక్కువగా ఆవిరవుతుంది. తోటకు మల్చింగ్ చేస్తే ఎక్కువ సేపు తేమ ఉంటుంది. ఎండుగడ్డి కూడా మల్చింగ్‌గా వాడొచ్చు. పాత షీట్లు, పాత కిటికీ తెరలను మొక్కలపై కప్పినా ఫలితం ఉంటుంది. అధిక నీరు పెడితే బ్యాక్టీరియా అభివృద్ధి చెంది, ఆక్సిజన్ కొరత ఏర్పడుతుంది. అంతేకాక వ్యాధుల బారిన పడే ప్రమాదమూ లేకపోలేదు. తోటలో క్రమం తప్పకుండా కలుపు తొలగించాలి. వేడిగాలుల సమయాన ఎరువులు వేయొద్దు. ఎండతో ఒత్తిడికి గురైన మొక్కలు కోలుకునే వరకు ఎరువు వేయకూడదు.

వాహనాల నిర్వహణలో అప్రమత్తత



ఎం.రామాచారి

జీవన యానంలో వాహనాల వినియోగం కీలకంగా మారింది. ప్రస్తుత ఎండ తీవ్రత నేపథ్యాన వాహనదారులు జాగ్రత్తలు పాటించాలని మెకానిక్‌లు సూచిస్తున్నారు. ఖమ్మంకు చెందిన మెకానిక్ ఎం.రామాచారి ఇచ్చిన సూచనలు ఇలా..

- బైక్‌లు, కార్లే కాక ఎలక్ట్రికల్ వాహనాలను ఎండ సమయంలో వినియోగించినప్పుడు టైరు, ట్యూబ్‌లు చూసుకోవాలి. పెట్రోల్, డీజిల్ ఎప్పుడూ ఫుల్ ట్యాంక్ చేయించొద్దు. నిర్ణీత వ్యవధిలో ఇంజన్ ఆయిల్ మార్చాలి. ఆగకుండా ఎక్కువ దూరం ప్రయాణం చేయొద్దు. ఇంజన్ ఎప్పుడూ చల్లగా ఉండేలా ప్రయాణం కొనసాగించాలి. రేడియేటర్ కూలింగ్ తనిఖీ చేసుకోవాలి. బ్యాటరీ వాహనాలు అటు ఫుల్, ఇటు జీరో చార్జింగ్ అయ్యే వరకు చూడొద్దు. పార్కింగ్ సమయాన నీడ ప్రాంతాలనే ఎంచుకోవాలి.

ఉమ్మడి జిల్లాలో నానాటికీ పెరుగుతున్న ఎండలు

- పిల్లలు, వృద్ధుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి అవసరం
- వాహనాలు, మొక్కల సంరక్షణా కీలకమే..

ఎండతో అనారోగ్యం, తీసుకోవాల్సిన జాగ్రత్తలు



డాక్టర్ నారగాని రాంప్రసాద్



డాక్టర్ పవన్



ఎండతో ప్రజలకు ఎదురయ్యే ఇబ్బందులు, వీటిని అధిగమించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఖమ్మం జిల్లా ఆస్పత్రి జనరల్ ఫిజీషియన్ నారగాని రాంప్రసాద్, పీడియాట్రీషియన్ పవన్ వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. అధిక వేడితో చెమట కారణంగా ఒంట్లో నీటిశాతం తగ్గి, లవణాలు బయటకు వెళ్తాయి. ఫలితంగా డీహైడ్రేషన్‌కు గురై తలనొప్పి, స్పృహ కోల్పోవడం, మాట తడబడడం, వికారం, అలసట, కళ్లుతిరగడం, రక్తపోటు సమస్యలు తలెత్తుతాయి. ఎండ ప్రభావం ఎక్కువగా వృద్ధులు, చిన్నారులు, గర్భిణులపై పడే అవకాశముంది. వీటి నివారణకు శరీరానికి కావాల్సినంత నీరు, నీటి శాతం ఎక్కువగా ఉండే పండ్లు, కొబ్బరినీరు, పెరుగు, మజ్జిగ తీసుకోవడం మంచిది. నిమ్మరసం, ఓఆర్ఎస్ ద్రావణాలు తీసుకుంటూ ఉండాలి. ఆల్కహాల్, టీ, కాఫీ, ధూమపానానికి దూరంగా ఉండాలి. వడదెబ్బతో అస్వస్థతకు గురైన వారిని చల్లటి ప్రదేశానికి తీసుకెళ్లి తల నుంచి కాళ్ల వరకు తడిగుడ్డతో తుడవాలి. గాలి ఆడేలా చూస్తూ తేరుకున్నాక ఓఆర్ఎస్ తాగించి ఆస్పత్రికి తీసుకెళ్లాలి. వీటన్నింటికి మించి ఉదయం 11 నుంచి సాయంత్రం 4లోపు తప్పనిసరైతే తప్ప బయటకు వెళ్లొద్దు. పిల్లలు ఎండలో ఆడకుండా పర్యవేక్షించాలి. తగిన నీరు తాగేలా చూడాలి. డయేరియాకు గురికాకుండా తేలికపాటి ఆహారమే ఇస్తూ నూనె పదార్థాలు, వేపుళ్లు, జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉంచాలి. పిల్లలకు అనారోగ్య సమస్యలు వస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి.



ఉపకరణాలన్నీ ఒకేసారి వాడొద్దు



కె.ద్రోణయ్య

వేసవి.. అందునా అధిక ఉష్ణోగ్రత ఉన్న నేపథ్యాన ఇళ్లలో అన్ని ఎలక్ట్రికల్ ఉపకరణాలను ఒకేసారి వినియోగించకపోవడమే మేలని ఖమ్మానికి చెందిన ఎలక్ట్రీషియన్ కె.ద్రోణయ్య చెబుతున్నారు. ఆయన సూచనల మేరకు గృహవాసులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- ఏసీలు, గీజర్ వంటి అధిక లోడ్ తీసుకునే పరికరాలను ఒకేసారి వాడితే షార్ట్ సర్క్యూట్ అయ్యే ప్రమాదం ఉంది. అవసరాలకు అనుగుణంగా.. ఓల్టేజీ ఆధారంగా ఉపకరణాలను వినియోగించాలి. ఎండ తీవ్రత ఉన్న కాలంలో వైరింగ్ సరిచూసుకోవాలి. ఇంటి వైరింగ్‌కు తప్పనిసరిగా ఎర్తింగ్ ఉండేలా చూసుకుని.. ఎర్తింగ్ ప్రాంతంలో అప్పుడప్పుడు నీరు పోయాలి.

న్యూస్‌రీల్

చెక్‌బౌన్స్ కేసులకు ప్రత్యేక లోక్‌అదాలత్

ఖమ్మంలీగల్: చెక్ బౌన్స్ కేసుల పరిష్కారానికి జిల్లా న్యాయసేవాధికార సంస్థ, తాలూకా న్యాయసేవాధికార కమిటీలతో కలిసి ప్రత్యేక లోక్‌అదాలత్‌లు నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ జి.రాజగోపాల్ తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లు జూన్ 9నుంచి 14వ తేదీ వరకు జరుగుతాయని వెల్లడించారు. కక్షిదారులు సంబంధిత కోర్టులో వారి న్యాయవాదులను లేదా జిల్లా న్యాయసేవాధికారి సంస్థ కార్యదర్శి, చైర్మన్, తాలూకా న్యాయసేవాధికార కమిటీలను సంప్రదించి కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు.

వ్యవసాయ శాఖలో పదోన్నతులు

- డీడీలకు జేడీలుగా, ఏడీలకు డీడీలుగా అవకాశం

ఖమ్మంవ్యవసాయం: వ్యవసాయ శాఖలో పదోన్నతుల ప్రక్రియ శనివారం మొదలైంది. రాష్ట్రంలోని 5, 6వ జోన్లలో పనిచేస్తున్న ఆరుగురు డిప్యూటీ డైరెక్టర్లకు జాయింట్ డైరెక్టర్లుగా పదోన్నతి కల్పించి పోస్టింగ్ ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా ఖమ్మం రైతు శిక్షణా కేంద్రంలో డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న అభిమన్యుడును జిల్లాలోనే ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్‌గా నియమించినట్లు సమాచారం. అలాగే, హైదరాబాద్‌లో డిప్యూటీ డైరెక్టర్‌గా ఉన్న సింగారెడ్డిని ఖమ్మం జేడీగా నియమించినట్లు తెలిసింది. ఆయన త్వరలోనే ఉద్యోగ విరమణ చేయనున్నందున హైదరాబాద్‌లోనే కొనసాగించే అవకాశమున్నట్లు సమాచారం. ఇక మహబూబాబాద్ డీఏఓగా పనిచేస్తున్న డిప్యూటీ డైరెక్టర్ ఎం.విజయనిర్మలకు జేడీగా పదోన్నతి కల్పించి వరంగల్ ఆత్మ ప్రాజెక్టుగా డైరెక్టర్‌గా నియమించినా మహబూబాబాద్‌లోనే కొనసాగించనున్నట్లు తెలిసింది. కాగా, అసిస్టెంట్ డైరెక్టర్లకు డిప్యూటీ డైరెక్టర్లుగా పదోన్నతి కల్పించే ప్రక్రియ సోమవారం చేపట్టనుండగా, ఉమ్మడి జిల్లాలో ముగ్గురికి అవకాశం లభించనుంది.

నేడు దిశ కమిటీ సమావేశం

ఖమ్మంమయూరిసెంటర్ : జిల్లా అభివృద్ధి, సమన్వయ, పర్యవేక్షణ (దిశ) కమిటి సమావేశాన్ని సోమవారం మధ్యాహ్నం 2.30 గంటలకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఖమ్మం ఎంపీ, దిశ కమిటి చైర్మన్ రామసహాయం రఘురాంరెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో జిల్లాలో నిర్దేశిత కేంద్ర పథకాల అమలు తదితర అంశాలపై చర్చిస్తామని పేర్కొన్నారు.

చిన్నారులపై ముందు 'చూపు'

- బాలబాలికలకు నేత్ర పరీక్షలు
- 12 బృందాలతో స్క్రీనింగ్
- అంగన్‌వాడీ కేంద్రాల్లో పరీక్షల నిర్వహణ



పిల్లలకు స్క్రీనింగ్ చేస్తున్న వైద్యబృందం

జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలు	1,840
ఆరేళ్లలోపు చిన్నారులు	69,018 మంది
ఇప్పటి వరకు స్క్రీనింగ్	12,344 మందికి

సత్తుపల్లిటౌన్: పిల్లలు మారాం చేశారనో.. అన్నం తినడం లేదనో.. చెప్పిన మాట వింటారనే భావనతోనో తల్లిదండ్రులు సెల్‌ఫోన్లు ఇస్తుండడం ఆనవాయితీగా మారింది. తద్వారా గంటల తరబడి కార్టూన్లు చూడడం పిల్లలకు అలవాటుగా మారుతోంది. దీనికి తోడు పోషకాహారలోపం, జన్యుపరమైన కారణాల వల్ల ఆరేళ్లలోపు చిన్నారుల్లోనూ దృష్టి లోపం, ఇతర కంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం చిన్నారులకు ప్రత్యేకంగా కంటి పరీక్షలు చేయించాలని నిర్ణయించింది.

ప్రత్యేక కార్యాచరణ..

దృష్టి లోపాలు కలిగిన చిన్నారులను ప్రాథమిక స్థాయిలోనే గుర్తించి చికిత్స అందించాలనేది ప్రభుత్వ లక్ష్యం. తద్వారా పిల్లలకు భవిష్యత్‌లో కంటి సంబంధిత సమస్యలు ఎదురుకావని భావిస్తోంది. ఇందులో భాగంగా జిల్లాలోని 1,840 అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ఆర్‌బీఎస్‌కే(రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమం) వైద్య బృందాలు, అప్తమాలజిస్టులతో కలిసి కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈనెల 7వ తేదీన కార్యక్రమాన్ని ప్రారంభించగా మూడు నెలల పాటు జిల్లాలోని ఎనిమిది ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 69,018 మంది చిన్నారులకు కంటి పరీక్షలు పూర్తవుతాయి. కంటి వైద్య నిపుణులతో చేయిస్తున్న ఈ పరీక్ష కోసం ప్రభుత్వం ప్రత్యేక వైద్య పరికరాలు కూడా సరఫరా చేసింది. ఇప్పటికే జిల్లాలో 12,344 మంది చిన్నారులకు స్క్రీనింగ్ పూర్తిచేశారు. కంటి పరీక్షలతో పాటు ఇతర ఆరోగ్య పరీక్షలు సైతం చేస్తూ అవసరమైన వారికి మందులు అందిస్తున్నారు.

12 బృందాలతో..

క్షేత్ర స్థాయిలో ఆర్‌బీఎస్‌కే బృందాలు చిన్నారుల స్క్రీనింగ్ నిర్వహిస్తున్నాయి. జిల్లాలో 12 బృందాలు అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి ఆరేళ్లలోపు చిన్నారులకు కంటి పరీక్షలు చేస్తున్నారు. ఈ బృందంలో ఒక పురుష, ఒక మహిళా డాక్టర్‌తో పాటు ఫార్మసిస్టు, ఏఎన్‌ఎం ఉంటారు.

గుర్తించే సమస్యలు..

స్క్రీనింగ్ శిబిరాల్లో పిల్లలకు మెల్లెకన్ను, పుట్టుకతో వచ్చే శుక్లాలు, టెరీజియం, కనురెప్పలు కిందకు పడిపోవడం వంటి సమస్యలు ఉంటే గుర్తిస్తున్నారు. ఇవి కాక దృష్టి లోపం, కళ్లలో మచ్చలు తదితర సమస్యలు ఉన్నా గుర్తించి ప్రత్యేకంగా నమోదు చేస్తున్నారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే పిల్లలను జిల్లా ఆస్పత్రికి రిఫర్ చేస్తున్నారు.

ఘనంగా బీఆర్‌ఎస్ రజతోత్సవం



వేడుకల్లో మాట్లాడుతున్న పువ్వాడ అజయ్‌కుమార్



ఎల్కతుర్తి సభా వేదికపై వద్దిరాజు తదితరులు

జిల్లా నుంచి భారీగా తరలివెళ్లిన పార్టీ శ్రేణులు

ఖమ్మంమయూరిసెంటర్ : జిల్లాలో బీఆర్‌ఎస్ రజతోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. నగరంలోని పలు డివిజన్లలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, పార్టీ జిల్లా కార్యాలయంలో ఎమ్మెల్సీ, జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర తదితరులు గులాబీ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పువ్వాడ, వద్దిరాజు మాట్లాడుతూ.. తెలంగాణ సాధించిన పార్టీగా, సంక్షేమ పథకాలు అందించిన ప్రభుత్వంగా బీఆర్‌ఎస్ ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసిందని అన్నారు. అనంతరం ఎల్కతుర్తిలో జరిగే పార్టీ రజతోత్సవ సభకు పెద్ద సంఖ్యలో వాహనాల్లో బయలుదేరి వెళ్లారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, కందాళ ఉపేందర్ రెడ్డి, కొండబాల కోటేశ్వరరావు, చంద్రావతి తదితరులు పాల్గొన్నారు.

యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు..

కూసుమంచి: ఇటీవల సంభవించిన భారీ వరదలకు పాలేరు రిజర్వాయర్ నుంచి జిల్లాలోని ఆయకట్టుకు నీరందించే ఎడమ కాల్వకు భారీ గండ్లు పడటంతో పాటు అక్కడక్కడా కోతకు గురి కాగా మరమ్మతు పనులు యుద్ధ ప్రాతిపదికన నిర్వహిస్తున్నారు. యాసంగి పంటల సీజన్ ముగియటంతో భారీగా కోతకు గురైన మినీ హైడల్ ప్రాజెక్టు కాల్వ కట్టలతో పాటు మత్స్య పరిశోధనా కేంద్రం సమీపంలో కోతకు గురైన ఎడమ కాల్వ కట్టలను పటిష్ట పరుస్తున్నారు. వానాకాలం పంటల సీజన్ నాటికి ఈ పనులను పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.



కాల్వ కోతకు గురైన ప్రాంతంలో కొనసాగుతున్న పనులు

తేమ శాతం చూశాకే కాంటా వేయాలి

అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

కల్లూరు: యాసంగి ధాన్యాన్ని తూర్పార పట్టి, తేమ శాతం చూసిన తర్వాతే కాంటాలు వేయాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఆదివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తేమ శాతం ఎక్కువగా ఉండి, తూర్పారా పట్టని ధాన్యాన్ని మిల్లర్లకు పంపితే వారు దిగుమతి చేసుకోవడం లేదని, దీంతో రైతులే ఇబ్బంది పడాల్సి వస్తుందని అన్నారు. మిల్లులకు రవాణా చేసిన ధాన్యాన్ని సకాలంలో దిగుమతి చేసుకోవడం లేదని, ఎక్కువ సమయం టార్పాలిన్లు వేసి ఉంచడంతో ధాన్యంలో తేమ శాతం పెరుగుతోందని రైతులు ఆయన దృష్టికి తెచ్చారు. అలాంటి ధాన్యాన్ని మిల్లర్లు దిగుమతి చేసుకోవడం లేదన్నారు. దీంతో రైతులకు సహకరించాలని మిల్లర్లకు సూచించిన శ్రీనివాసరెడ్డి.. రైతులు కూడా నాణ్యమైన ధాన్యాన్ని మిల్లులకు పంపించాలని కోరారు.

సమావేశంలో ఆర్‌డీఓ ఎల్.రాజేందర్ గౌడ్, పౌరసరఫరాల శాఖ మేనేజర్ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

లౌకిక తత్వంపై మాట్లాడితే సస్పెన్షనా?

- ఎస్‌ఎఫ్‌ఐ జాతీయ ఉపాధ్యక్షుడు నితీష్ నారాయణ్
- ముగిసిన రాష్ట్ర మహాసభలు



మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ జాతీయ ఉపాధ్యక్షుడు నితీష్ నారాయణ్

ఖమ్మంమయూరిసెంటర్ : ఎస్‌ఎఫ్‌ఐ ఓ విశ్వవిద్యాలయం వంటిదని సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షులు నితీష్ నారాయణ్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం హిందూత్వ ఎజెండాతో ముందుకు సాగుతోందని, లౌకికతత్వంపై మాట్లాడితే రీసెర్చ్ స్కాలర్ రాందాస్‌ను రెండేళ్ల పాటు యూనివర్సిటీ నుంచి బహిష్కరించిందని ఆరోపించారు. ఖమ్మం భక్త రామదాసు కళాక్షేత్రంలో మూడు రోజులు సాగిన ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర మహాసభలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా నితీష్ నారాయణ్ మాట్లాడుతూ.. ధనిక, ఫ్యూడల్ భావజాలానికి వ్యతిరేకంగా శ్రమజీవుల పక్షాన తమ సంఘం నిలబడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తూ హెచ్‌సీయూ భూములను కాజేస్తోందన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ దేశానికి ఎంతోమంది నిష్ణాతులను ఇచ్చిందని, జై భీమ్ చిత్ర ఇతివృత్తానికి సంబంధించిన జస్టిస్ చంద్రు ఎస్‌ఎఫ్‌ఐకి చెందిన వారే కావడం గర్వకారణమని అన్నారు. త్యాగధనులు పుట్టిన గడ్డ ఖమ్మంలో మహాసభలు జరగడం హర్షణీయమని అన్నారు. కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ విద్యారంగాన్ని కాషాయీకరణ చేసే కుట్రలో భాగంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యా విధానానికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కోయ చంద్రమోహన్, ఐద్వా రాష్ట్ర కోశాధికారి మాచర్ల భారతి, సోషల్ మీడియా రాష్ట్ర నాయకులు పిట్టల రవి, సీఐటీయూ నాయకులు కల్లూరు మల్లేష్, ఎస్‌ఎఫ్‌ఐ పూర్వ నాయకులు నాగేశ్వరరావు తదితరులు మాట్లాడారు. కాగా, మహాసభలో 17 తీర్మానాలను ఆమోదించారు.

క్రీడాశిక్షణకు వేళాయె..



ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా క్రీడా శాఖ ఏటా మాదిరిగానే ఈసారి కూడా వేసవి క్రీడా శిక్షణ శిబిరాల నిర్వహణకు సమాయత్తమైంది. ఇప్పటికే క్రీడల వారీగా వేదికలను ఖరారు చేసింది. అంతేకాక శిక్షణ కోసం డీఎస్ఏల కోచ్‌లు, ప్రభుత్వ పీఈటీలు, పీడీలే కాక ఔత్సాహికులను కోచ్‌లుగా నియమించింది. వీరికి గౌరవ వేతనంగా రూ.4వేలు ఇవ్వనున్నారు. ఈ మేరకు వచ్చే నెల 1వ తేదీ నుంచి క్రీడల వారీగా శిక్షణ ఇచ్చే వేదికలు, కోచ్‌ల వివరాలను డీవైఎస్‌ఓ టి.సునీల్ రెడ్డి వెల్లడించారు.

ఎక్కడెక్కడ అంటే...

బోనకల్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో బాల్‌బ్యాడ్మింటన్ శిక్షణ ఉంటుంది. అలాగే, మల్లెమడుగు, రఘునాథపాలెం, కుంచపర్తి జెడ్పీహెచ్‌ఎస్‌ల్లో ఫుట్‌బాల్, ముదిగొండ, గుదిమళ్ల, కొత్తలింగాల, ఎం.వీ.పాలెం, మంచుకొండ జెడ్పీహెచ్‌ఎస్‌లతో పాటు కల్లూరు మినీ స్టేడియంలో వాలీబాల్ శిక్షణ ఇస్తారు. తనికెళ్ల, తిమ్మపేట జెడ్పీహెచ్‌ఎస్‌లతో పాటు కల్లూరు, మధిర మినీ స్టేడియాల్లో కబడ్డీ, కొదుమూరు, పాండురంగాపురం జెడ్పీహెచ్‌ఎస్‌ల్లో హ్యాండ్‌బాల్, వెంకటగిరి, బచ్చోడు, జెడ్పీహెచ్‌ఎస్‌ల్లో నెట్‌బాల్, మధిర, వైరా, కల్లూరు మినీ స్టేడియాల్లో బ్యాడ్మింటన్, వైరా మినీ స్టేడియంలో లాన్ టెన్నిస్, కల్లూరు మినీ స్టేడియంలో అథ్లెటిక్స్ శిక్షణ శిబిరాలు ఏర్పాటుచేస్తున్నట్లు డీవైఎస్‌ఓ వివరించారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయిలో ఉషా క్రీడాకారుల ప్రతిభ


పతకాలతో క్రీడాకారులు

ఖమ్మంస్పోర్ట్స్: రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి ఉషా టోర్నీలో జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించారు. సీనియర్ విభాగంలో పి.సత్యజిత్‌చారి, పి.పవిత్రచారి, ఎస్.ఉదయ్‌కిరణ్ మొదటి స్థానం దక్కించుకున్నారు. క్రీడాకారులను డీవైఎస్‌ఓ టి.సునీల్‌రెడ్డి, కోచ్ పి.పరిపూర్ణాచారి ఆదివారం అభినందించారు.

కాంటాల జ్యాపంపై రైతుల ఆగ్రహం


లారీలకు అడ్డుగా నిలిచి నిరసన తెలుపుతున్న రైతులు

నేలకొండపల్లి: మండలంలోని రాజారాంపేట ప్రాథమిక సహకార సంఘం పరిధిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఇష్టారాజ్యంగా కాంటాలు వేస్తున్నారని రైతులు మండిపడ్డారు. కాంటాల్లో జాప్యం చేస్తున్నారని రైతులు ఆదివారం కేంద్రం వద్ద ఆందోళన చేపట్టారు. నెల రోజులుగా కేంద్రంలో ధాన్యం ఆరబెట్టినప్పటికీ కాంటాలు వేయటం లేదని.. కొందరికి మాత్రం అప్పటికప్పుడే వచ్చిన ధాన్యానికి కూడా కాంటాలు వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. లారీలను వెళ్లకుండా అడ్డుకున్నారు. ఈ విషయంపై రాజారాంపేట సొసైటీ సీఈఓను వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులో లేరు.

నిత్యాన్నదాన సత్రం వరకు తివాచీ

భద్రాచలం: శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానం అధికారులు భక్తుల కోసం ఆలయం నుంచి సత్రం వరకు తివాచీ ఏర్పాటు చేశారు. వేసవి కాలంలో భక్తులు అన్నదాన సత్రానికి నడిచిరావాలంటే తీవ్ర ఇబ్బందులు పడతున్నారు. దీంతో ఆలయం నుంచి సత్రం వరకు రోడ్డు మీద తివాచీ (మ్యాట్)ని పరచగా.. భక్తులు కృతజ్ఞతలు తెలిపారు.

రెండు బార్ షాపులకు రేపు డ్రా

ఖమ్మంక్రైం : నగరంలో మూతబడిన రెండు బార్ షాపుల స్థానంలో కొత్త షాపుల కోసం పలువురు చేసుకున్న దరఖాస్తులకు సంబంధించి ఈనెల 29న కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో డ్రా తీయనున్నట్లు జిల్లా ఎక్సైజ్ అధికారి నాగేందర్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ చేతుల మీదుగా జరిగే ఈ కార్యక్రమానికి హాజరయ్యేవారు తమ వద్ద ఉన్న హాల్‌టికెట్‌తో చేరుకోవాలని, మీటింగ్ హాల్‌లోకి సెల్‌ఫోన్‌లను అనుమతించబోమని పేర్కొన్నారు.

లాక్రోస్ జాతీయస్థాయి టోర్నమెంట్‌కు కార్తీకరెడ్డి


కార్తీకరెడ్డి

తల్లాడ: ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాలో ఈ నెల 28 నుంచి మే 1వ తేదీ వరకు నిర్వహించనున్న లాక్రోస్ 3వ జూనియర్, సీనియర్ జాతీయస్థాయి టోర్నీలో పాల్గొనేందుకు తల్లాడకు చెందిన డి.కార్తీకరెడ్డి ఎంపికైంది. తల్లాడకు చెందిన దగ్గుల రామకృష్ణారెడ్డి, విజయలక్ష్మి దంపతుల కుమార్తె కార్తీకరెడ్డి హైదరాబాద్‌లోని గురుకుల పాఠశాలలో 9 వతరగతి చదువుతోంది. క్రీడల్లో కూడా రాణిస్తూ జాతీయ పోటీలకు ఎంపికైంది. తెలంగాణ జట్టు తరఫున కార్తీకరెడ్డి ఆదివారం బయలుదేరి ఆగ్రా వెళ్లింది. కాగా, కార్తీకరెడ్డికి దగ్గుల శ్రీనివాసరెడ్డి, దగ్గుల నాగిరెడ్డి, దూపాటి భద్రరాజు, చల్లా నాగులు, జీవీఆర్ అభినందలు తెలిపారు.

వెదురు ఉత్పత్తులు అద్భుతం

భద్రాచలం/చంద్రుగొండ/ములకలపల్లి: వెదురు ఉత్పత్తులతోపాటు ఆదివాసీల సంస్కృతి సంప్రదాయాలు తెలిసేలా భద్రాచలంలో ఏర్పాటు చేసిన మ్యూజియం అద్భుతంగా ఉన్నాయని గుల్జార్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు సుస్మిత కనేరి అన్నారు. ఆదివారం ఆమె భద్రాచలంలోని ఐటీడీఏ ప్రాంగణంలో ఉన్న ట్రైబల్ మ్యూజియం, చంద్రుగొండ మండలంలోని బెండాలపాడు శివారులోని బ్యాంబో క్లస్టర్‌తోపాటు ములకలపల్లి మండలంలోని మాధారం గ్రామంలో ఏర్పాటు చేసిన ఆర్ట్స్, క్రాఫ్ట్స్ యూనిట్‌ను సందర్శించి మాట్లాడారు. గిరిజన సంప్రదాయ హస్తకళల అభివృద్ధికి ప్రత్యేక కార్యచరణ చేపట్టనున్నట్లు తెలిపారు. వెదురు ఉత్పత్తుల తయారీలో గిరిజన సంస్కృతి ఉట్టిపడుతోందని, మార్కెటింగ్‌పై కలెక్టర్‌తో చర్చించనున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో వెంకయ్య, వీరస్వామి, హరికృష్ణ, అంజన్, ఈసం నాగభూషణం, మల్లం కృష్ణయ్య, బొర్రా సురేశ్, వి.గోవర్ధన్ పాల్గొన్నారు.

పాడి వృద్ధి.. పాలు సమృద్ధి..



సహకార సంఘాల సభ్యులకు డీసీసీబీ ద్వారా రుణాలు

- పాడి యూనిట్లలో 70 శాతం మేర లోన్
- ఆపై సొసైటీల ద్వారా పాల సేకరణకు ప్రణాళిక


జిల్లా కేంద్ర సహకార బ్యాంకు

ఖమ్మంవ్యవసాయం: చిన్న, సన్నకారు రైతుల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) పాడి పథకానికి రూపకల్పన చేసింది. పాలు, పాల ఉత్పత్తులకు ఉన్న డిమాండ్ దృష్ట్యా ఈ ప్రాజెక్టును రూపొందించగా.. రైతుల సంక్షేమం, శ్రేయస్సు కోసం కొనసాగుతున్న సహకార సంఘాల్లో సభ్యులకు లబ్ధి జరగనుందని భావిస్తున్నారు. ఇప్పటికే వ్యవసాయ రంగ అభివృద్ధి కార్యకలాపాలు నిర్వహిస్తున్న క్రమాన అనుబంధంగా పాడి పరిశ్రమకూ ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు. రూ.3,460.70 కోట్ల లావాదేవీలతో రాష్ట్రంలోనే రెండో స్థానంలో కొనసాగుతున్న ఖమ్మం డీసీసీబీ ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలే కాక మహబూబాబాద్, ములుగు జిల్లాల్లోని బయ్యారం, గార్ల, వాజేడు, వెంకటాపురం మండలాలకు విస్తరించి ఉంది. మొత్తంగా 100 సహకార సంఘాలతో 1.70 లక్షల మంది సభ్యులతో కూడిన ఈ బ్యాంకు 50 బ్రాంచ్‌లతో లావాదేవీలు కొనసాగిస్తోంది. ఈ ఏడాది రూ.9.64 కోట్ల లాభాలతో ఉన్న నేపథ్యాన పాడి పరిశ్రమపై ఆసక్తి ఉన్న వారికి చేయూతనివ్వాలని



కొత్త పథకాన్ని రూపొందించింది. తద్వారా ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి పాలు దిగుమతి అవసరం లేకుండా స్థానికంగా పాల ఉత్పత్తి పెరుగుతుందని భావిస్తున్నారు.

30 శాతం నిధులు చాలు..

పాడి యూనిట్ల స్థాపనకు ముందుకొచ్చే రైతులకు డీసీసీబీ రుణాలు ఇవ్వనుంది. ఆసక్తి కలిగిన వారు 30 శాతం నిధులతో ముందుకొస్తే మిగతా 70 శాతం నిధులను బ్యాంకు వాటాగా సమకూరుస్తుంది. ఉదాహరణకు రూ.లక్ష విలువైన గేదెకు రైతు రూ.30 వేలు తన వాటాతో సిద్ధమైతే మిగతా రూ.70 వేలు రుణంగా అందుతుంది. గరిష్టంగా రెండు గేదెల వరకు అవకాశం కల్పిస్తారు.

సొసైటీ సభ్యులకే అవకాశం

ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘా(పీఏసీఎస్)ల్లో సభ్యులైన వారికి మాత్రమే ఈ పథకంలో చోటు కల్పిస్తారు. వ్యవసాయ భూమి, సాగు నీటి వనరులు ఉండి, పంటలు సాగు చేసే వారికి పాడి పరిశ్రమలో ప్రాధాన్యత ఇస్తే బహుముఖ లాభాలు ఉంటాయని భావిస్తున్నారు. తద్వారా సహకార సంఘాల ఉద్దేశం కూడా నెరవేరి చిన్న, సన్నకారు రైతులు ఆర్థికంగా బలోపేతమయ్యే అవకాశముంటుందని చెబుతున్నారు.

పీఏసీఎస్‌ల ద్వారా పాల సేకరణ

రైతులు పాడి యూనిట్ల ద్వారా ఉత్పత్తి చేసే పాలను సైతం పీఏసీఎస్‌ల ద్వారా సేకరిస్తారు. దళారులు లేకుండా వెన్న శాతం ఆధారంగా కొనుగోలు చేయనున్నారు. ఈ ప్రక్రియతో సహకార సంఘాలతో పాటు పాడి రైతులకు ప్రయోజనం కలగనుంది. పాల కొనుగోలుకు అవసరమైన శీతలీకరణ యంత్రాలు, పరికరాలను పీఏసీఎస్‌లు సమకూర్చుకుంటాయి.

కలెక్టర్ అనుమతితో అమలు



చిన్న రైతుల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా పాడి పరిశ్రమ ప్రాజెక్టును రూపొందించాం. సాగర్యాలు ఉన్న ప్రాంతాల రైతులకు ప్రాధాన్యత ఉంటుంది. సహకార లక్ష్యం నెరవేరేలా పథకాన్ని అమలుచేస్తాం. బ్యాంకు పాలకవర్గం నిర్ణయంతో పాటు కలెక్టర్ అనుమతితో జూన్ నాటికి ఈ ప్రాజెక్టును ప్రారంభించనున్నాం.

–ఎస్.వెంకటఆదిత్య, సీఈఓ, డీసీసీబీ ఖమ్మం

నీటి వనరులు ఉన్న ప్రాంతాలకు ప్రాధాన్యత

డీసీసీబీ పరిధిలో నీటి వనరులు ఉన్న ప్రాంతాల్లో పాడి పరిశ్రమ పథకాన్ని అమలు చేసేందుకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. సాగర్ ఆయకట్టు ప్రాంతంతో పాటు ఇతర జలవనరులు ఉన్న ప్రాంతాల్లో సహకార సంఘాల సభ్యులకు రుణాలు ఇవ్వనుండగా.. ఉమ్మడి జిల్లాలో సత్తుపల్లి, మధిర, వైరా, కూసుమంచి, భద్రాచలం, పినపాక వ్యవసాయ డివిజన్లలో అవకాశం దక్కనుంది. స్థానిక వాతావరణాన్ని తట్టుకునే జాతుల గేదెలనే రైతులు ఎంపిక చేసుకునేలా పశుసంవర్థక శాఖ పర్యవేక్షణ ఉంటుంది.

ఆమె విజయం.. స్ఫూర్తిదాయకం..

- వ్యాధి భయపెట్టినా.. లక్ష్యాన్ని చేరిన యువతి..
- గ్రూప్–1తో పాటు 5 ఉద్యోగాల విజేత జ్యోతి శిరీష


జ్యోతిశిరీషను సన్మానిస్తున్న కూరపాటి ప్రదీప్‌కుమార్

ఖమ్మంవైద్యవిభాగం: యాభైసార్లు రక్తం ఎక్కించుకుని, ఒకవైపు తన వ్యాధిని నయం చేసుకుంటూనే మరోవైపు సర్కారు కొలువు కొట్టాలనే సంకల్పంతో పోరాడి.. తన లక్ష్యాన్ని చేరుకున్న జ్యోతి శిరీష ఆదర్శప్రాయురాలని ప్రముఖ చిన్నపిల్లల వైద్యులు కూరపాటి ప్రదీప్‌కుమార్ పేర్కొన్నారు. రేయింబవళ్లు పుస్తకాలతో కుస్తీ పట్టి గ్రూప్–1లో ర్యాంకు సాధించి ఏకంగా 5 సర్కారు కొలువులను కొట్టిన యువతి.. ఖమ్మం జిల్లాకే గర్వకారణమని కొనియాడారు. నిరుపేద కుటుంబంలో జన్మించి, బాల్యం నుంచే సికిల్‌సెల్ రక్తహీనతతో కూడిన వ్యాధితో బాధపడుతున్న ఆమె.. ఐదు ఉద్యోగాలు సాధించిన తీరు అద్భుతమన్నారు. ఆమె పూర్తి వైద్య ఖర్చులతో పాటు మందులను కూడా ఉచితంగా అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఆదివారం ఆయన వైద్యశాలలో జ్యోతి శిరీషను సన్మానించారు. ఈ సందర్భంగా జ్యోతిశిరీష మాట్లాడుతూ.. అత్యంత ప్రమాదకరమైన సికిల్‌సెల్ వ్యాధితో తాను బాధపడుతూ అనేక సందర్భాల్లో తాను సమాజాన్ని చూస్తానో లేదో అని భయపడినప్పటికీ.. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే అకుంఠిత దీక్షతో తాను గ్రూప్–1లో ర్యాంకును సాధించానని తెలిపారు. తనది జిల్లాలోని మిట్టపల్లి గ్రామమని, తండ్రి సుతారీ మేస్త్రి, అమ్మ వ్యవసాయ కూలీ అని తెలిపారు. తాను సికిల్ సెల్ ఎనీమియా (తీవ్ర రక్తహీనత) బాధితురాలినని, ఆరో తరగతిలో తనకీ సమస్య ఉందని వైద్యులు నిర్ధారించారని, తరచూ రక్తం తగ్గిపోయి కాళ్లు, చేతులు వాపు వచ్చేవని, దానికితోడు తలనొప్పి, ఎముకల మధ్య సూదులతో గుచ్చినట్లు బాధ ఉండేదని, అన్నీ భరించి, ఉద్యోగాలు సాధించానని, తల్లిదండ్రులు ఎంతో ప్రోత్సహించారని తెలిపారు.

ఘనంగా రిటైర్డ్ ఉద్యోగుల సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న రిటైర్డ్ ఉద్యోగులు

ఖమ్మంమామిళ్లగూడెం: ఉమ్మడి ఖమ్మం జిల్లా రెవెన్యూ శాఖ రిటైర్డ్ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఖమ్మం ఈఆర్ఆర్ ఫంక్షన్ హాల్‌లో స్తంభాద్రి బ్యాంక్ చైర్మన్ ఎర్నేని రామారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గాలిశెట్టి కార్టూన్ సందడి–2024 చిత్రమాలిక సభ్యులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో బసవరాజు ఉపేందర్‌రావు, నాగాచారి, సాంబశివరావు, సుదర్శన్‌రావు, ఆంజనేయులు, సుధాకర్, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

అన్ని కార్పొరేషన్ సంస్థలకు అభ్యర్థుల ఖరారు


మాట్లాడుతున్న నాయిని రాజేందర్‌రెడ్డి

ఖమ్మంవన్‌టౌన్: పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా ఖాళీగా ఉన్న అన్ని కార్పొరేషన్ సంస్థలకు అభ్యర్థులను ఖరారు చేయనున్నట్లు కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయించిందని పీసీసీ పరిశీలకులు, వరంగల్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, బత్తిన శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌లో పార్టీ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ అధ్యక్షతన ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించగా వారు మాట్లాడారు. గ్రామ, మండల, పట్టణ, బ్లాక్‌స్థాయి కమిటీలకు సుమారు ఐదుగురు పేర్లతో ప్రతిపాదనలు పంపాలని, పార్టీ కోసం అహర్నిశలు కష్టపడి పనిచేసేవారి పేర్లనే సూచించాలని కోరారు. ఎమ్మెల్యేలు మట్టా రాగమయి, మాలోత్ రాందాస్‌నాయక్, పోట్ల నాగేశ్వరరావు, మల్‌రెడ్డి రాంరెడ్డి, మన్నే సతీశ్, నాయుడు సత్యనారాయణ, రాయల నాగేశ్వరరావు, దొండపాటి వేంకటేశ్వరరావు, కొరివి వెంకటరత్నం, మహ్మద్ జావేద్, నాగండ్ల దీపక్‌చౌదరి, మేయర్ పునుకొల్లు నీరజ, ఫాతిమా ముక్తార్‌జోహర, కొత్తా సీతారాములు, దొబ్బల సౌజన్య, సయ్యద్ గౌస్, వేజెండ్ల సాయికుమార్, సయ్యద్ ముజాహిద్‌హుస్సేన్, పుచ్చకాయల వీరభద్రం పాల్గొన్నారు.

సీపీఎం సీనియర్ నేత మధుసూదన్‌రావు మృతి

నివాళులర్పించిన పలు పార్టీల నాయకులు


మధుసూదన్‌రావు (ఫైల్)

కొణిజర్ల: మండలంలోని లాలాపురం గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నేత సంక్రాంతి మధుసూదన్‌రావు (83) ఆదివారం ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. కొద్దిరోజుల కిందట అనారోగ్యానికి గురవగా ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో శస్త్రచికిత్స చేశారు. ఆయనకు భార్య సామ్రాజ్యం, కుమారుడు రవి, కూతురు సంధ్య ఉన్నారు. మధుసూదన్‌రావు మృతదేహాన్ని నాగర్‌కర్నూలు ఎంపీ, కాంగ్రెస్ జాతీయ నాయకులు మల్లు రవి, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్, సీపీఎం జాతీయ సమితి సభ్యుడు తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు సందర్శించి, మృతదేహంపై ఎర్రజెండా కప్పి నివాళులర్పించారు. డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మధు విద్యా సంస్థల కార్యదర్శి మల్లెంపాటి వీరభద్రం, నాయకులు భూక్యా వీరభద్రం, బొంతు రాంబాబు, బొర్రా రాజశేఖర్, తాళ్లపల్లి కృష్ణ, కొప్పుల కృష్ణయ్య కూడా నివాళులర్పించారు. కాగా, మధుసూదన్‌రావు నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. గ్రామస్తులు, పలు పార్టీల నాయకుల సందర్శన అనంతరం సాయంత్రం అంతిమయాత్ర నిర్వహించి, మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ వైద్య కళాశాలకు అప్పగించారు.


నివాళులర్పిస్తున్న మల్లు రవి, ఎమ్మెల్యే రాందాస్ తదితరులు

కాల్వలోకి పల్టీ కొట్టిన కారు


కాల్వలోకి పల్టీ కొట్టిన కారు

వైరారూరల్: మితిమీరిన వేగం, నిర్లక్ష్యం కారణంగా ఓ కారు వైరా రిజర్వాయర్ ఎడమ కాల్వలోకి పల్టీకొట్టింది. మండలంలోని స్టేజీ పినపాక వద్ద రహదారి పక్కన కాల్వలో కారు పల్టీకొట్టి ఇద్దరు తీవ్రంగా గాయపడిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఖమ్మంలో రియల్టర్లుగా పనిచేస్తున్న వైరాకు చెందిన సయ్యద్ ఆసిఫ్, అతని స్నేహితుడు శ్రీనివాస్ ఈ ప్రమాదంలో గాయపడ్డారు. కారు వెనుక సీటులో ఉన్న మరో యువకుడు ఎలాంటి గాయాలు లేకుండా సురక్షితంగా బయటపడ్డాడు. కాల్వలో నీళ్లు లేకపోవటం, కారు పల్టీ కొట్టడానికి ముందే, ముందు సీట్‌లో ఉన్న ఇద్దరు చెట్లపై పడిపోవటంతో ప్రాణాపాయం తప్పింది. క్షతగాత్రులను 108 ద్వారా వైరా ఆస్పత్రికి.. అక్కడి నుంచి ఖమ్మం తరలించారు. వైరా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పహల్గాం ఘటనపై ఆళ్లపాడులో ఉద్రిక్తత

బోనకల్: పహల్గాం ఘటనకు సంబంధించి మండలంలోని ఆళ్లపాడులో ఆదివారం ఉద్రిక్తత చోటుచేసుకొంది. గ్రామానికి చెందిన బీజేపీ యువమోర్చా మండల అధ్యక్షుడు మరీదు పరుశురాం పహల్గాం ఘటనకు సంబంధించి యూ ట్యూబ్‌లో వచ్చిన వీడియోను డౌన్‌లోడ్ చేసి గ్రామానికి చెందిన వాట్సాప్ గ్రూప్‌లో పెట్టాడు. ఈ విషయంపై గ్రామంలోని మరో మతస్తులు కూడా స్పందించి పోస్టులు పెట్టారు. విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర నాయకులు గల్లా సత్యనారాయణ, దేవకీ వాసుదేవరావు తదితరులు గ్రామానికి చేరుకుని సమావేశం నిర్వహించారు. పరుశురాం ఉగ్రదాడులను ఖండిస్తూ సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ పెడితే తప్పేంటని ప్రశ్నించారు. కాగా, ఈ సమాచారం అందుకున్న పోలీసులు వచ్చి బీజేపీ నాయకులను అక్కడి నుంచి పంపించేశారు. ఈ ఘటనపై పరుశురాం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తనను కొందరు చంపుతామని బెదిరించారని, మరో దేశానికి జై కొడుతూ నినాదాలు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. తనకు రక్షణ కల్పించాలని పోలీసులను కోరాడు.

యువకుడిపై పోక్సో కేసు

నేలకొండపల్లి: మండలంలోని ఓ యువకుడిపై పోక్సో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం .. మండలంలోని చెరువుమాధారం గ్రామానికి చెందిన బాలికకు అదే గ్రామానికి చెందిన యువకుడు మాయమాటలు చెప్పి.. గర్భవతిని చేశాడు. గుర్తించిన బాలిక కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. సదరు యువకుడిపై పోక్సో కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

తగ్గిన ఉష్ణోగ్రతలు

ఖమ్మంవ్యవసాయం: సూర్య ప్రతాపం కొంతమేర తగ్గింది. ఉష్ణోగ్రతలు ఆదివారం ఒక్కసారిగా పడిపోయాయి. శనివారంతో పోలిస్తే సుమారు 4 డిగ్రీల ఉష్ణోగ్రత తగ్గింది. శనివారం పమ్మిలో 43.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా ఆదివారం వేంసూరులో 39.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. గతవారం ఎండ తీవ్రత 40 నుంచి 44 డిగ్రీల (ఆరెంజ్) మధ్య నమోదైంది. హైదరాబాద్ కేంద్ర వాతావరణ శాఖ అప్రమత్తంగా ఉండాలని కూడా ప్రకటించింది. ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వెళ్లడానికి జంకారు. కార్మికులు పనులకు వెళ్లడానికి వెనకంజ వేశారు. వ్యవసాయ కూలీలు ఉదయం వేళల్లో మాత్రమే పనులకు వెళ్లారు. ఆదివారం 35–40 డిగ్రీల (ఎల్లో) మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సత్తుపల్లి ఓసీల వద్ద 39.7, గంగారం, వైరా ఏఆర్ఎస్, పెనుబల్లిలో 39.6, లింగాల, గేటు కారేపల్లి, కల్లూరులో 39.5, గౌరారంలో 39.4, వైరాలో 39.3, మధిర, ఎర్రుపాలెంలలో 39.2, తల్లాడ, కుర్నవల్లిలో 39, సిరిపురం, కొణిజర్లలో 38.9, సదాశివునిపాలెం, బచ్చోడు, ఏన్కూరు, పమ్మిలలో 38.8, మధిర ఏఆర్ఎస్‌లో 38.6, బణారం, ఖమ్మం ప్రకాష్‌నగర్, రఘునాథపాలెంలలో 38.5, సతుపల్లిలో 38.3, పల్లెగూడెంలో 38, అత్యల్పంగా ఖమ్మం కలెక్టరేట్ వద్ద 35.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

మహిళ అదృశ్యం

వ్యవసాయ బావిలో పడినట్లు అనుమానం

నేలకొండపల్లి: మహిళ కనిపించకుండా పోయిన ఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. మంచినీళ్లు తాగేందుకు వెళ్లి వ్యవసాయ బావిలో పడినట్లు గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అమ్మగూడెం గ్రామానికి చెందిన త్రివేణి తన పొలంలో వరి కోత యంత్రంతో పని చేయిస్తోంది. మంచినీళ్లు తాగేందుకు తన వ్యవసాయ బావి వద్దకు వెళ్లినట్లు స్థానికులు చెబుతున్నారు. ఇంటికి ఎంతసేపటికీ రాకపోవటంతో అనుమానం వచ్చి బావి వద్ద చూడగా కొడవలి కనిపించింది. బావిలో పడినట్లు అనుమానం వ్యక్తం చేయగా.. కోదాడ నుంచి గజ ఈతగాళ్లను రప్పించారు.

దళారులకు అండగా యంత్రాంగం



- పత్తి కొనుగోళ్లలో బినామీ పేర్లతో టీఆర్‌ల జారీ
- కొన్నిచోట్ల నకిలీ టీఆర్‌లు రూపొందించినట్లు అనుమానాలు
- లెక్కలు తేల్చడంలో నిమగ్నమైన విజిలెన్స్ అధికారులు

ఖమ్మంవ్యవసాయం: పత్తి సాగు చేసిన రైతులకు అండగా నిలవాలని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ద్వారా కొనుగోళ్లు చేపట్టగా.. ఇందుకోసం తాత్కాలిక రిజిస్ట్రేషన్లు (టీఆర్) జారీచేసే క్రమాన అక్రమాలు జరిగినట్లు తేలింది. ఈమేరకు దళారులకు కొందరు అధికారులు అండగా నిలవడంతో రైతులకు మద్దతు ధర దక్కకపోగా వారి వద్ద తక్కువ ధరకు పత్తి సేకరించిన మధ్యవర్తులు మాత్రం కాసులు దండుకున్నారు. ఈ వ్యవహారంపై విజిలెన్స్ అధికారులు చేపడుతున్న విచారణలో కొత్త అంశాలు వెలుగు చూస్తున్నాయి.

ఏమిటీ టీఆర్..

సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లకు వ్యవసాయ శాఖ రూపొందించిన పంట నమోదు ప్రక్రియను ప్రభుత్వం ప్రామాణికంగా తీసుకుంది. అయితే పంట కొనుగోలు సమయానికి పంట నమోదు పూర్తి కాకపోవడంతో అవరోధం ఏర్పడే పరిస్థితి నెలకొంది. దీంతో తాత్కాలిక రిజిస్ట్రేషన్ల (టీఆర్) విధానాన్ని అమలుచేశారు. టీఆర్ పుస్తకాలను మార్కెటింగ్ శాఖ ముద్రించి వ్యవసాయ శాఖకు అప్పగించగా.. ఏఓలు, ఏఈఓలు రైతుల సాగు విస్తీర్ణాన్ని ధ్రువీకరించి పత్రాలు జారీచేశారు. వీటి ఆధారంగా సీసీఐ పత్తి సేకరించింది.

అక్రమాలు ఇలా..

జిల్లాలోని ఖమ్మం, మధిర, నేలకొండపల్లి, వైరా, మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్ల పరిధిలో తొమ్మిది జిన్నింగ్ మిల్లుల ఆధారంగా 4.50 లక్షల క్వింటాళ్ల పత్తిని సీసీఐ కొనుగోలు చేసింది. అయితే, మార్కెటింగ్ శాఖ ప్రింట్ చేసిన టీఆర్ బుక్స్‌ను వ్యవసాయ శాఖ ఉద్యోగులు రైతుల సాగు విస్తీర్ణం ఆధారంగా అందించాలి. కానీ, కొందరు రైతుల నుంచి దళారులు క్వింటా పత్తిని రూ.4 వేల నుంచి రూ.5 వేల చొప్పున కొనుగోలు చేసి.. వ్యవసాయ శాఖ ఉద్యోగులను మచ్చిక చేసుకోవడం ద్వారా బినామీ పేర్లతో టీఆర్‌లు తీసుకున్నారు. ఆపై సీసీఐ కేంద్రాల్లో కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన రూ.7,521కు క్వింటా చొప్పున పత్తి విక్రయించారు. ఫలితంగా రైతులకు బదులు వ్యాపారులకు లబ్ధి జరగడమే కాక ఉద్యోగులకూ వాటాలు అందినట్లు సమాచారం. ఈ విషయమై అందిన ఫిర్యాదులతో ప్రభుత్వం విజిలెన్స్ విభాగంతో విచారణకు ఆదేశించింది. ఈ మేరకు సీసీఐ వద్ద జాబితాల ఆధారంగా కొందరు రైతులను కలిసి సాగు వివరాలు, ఆధార్ నంబర్లు సేకరించడంతో అక్రమాలు నిజమేనని తేలింది. ఆపై జిల్లాల్లోని మార్కెటింగ్ శాఖలోనూ తనిఖీ చేస్తుండగా ఖమ్మం జిల్లాకు సైతం విజిలెన్స్ అధికారులు వచ్చారు. మొత్తంగా ముద్రించిన టీఆర్ పుస్తకాలు ఎన్ని, అందులో వ్యవసాయ శాఖకు ఎన్ని అప్పగించారు.. రైతులకు జారీ చేసినవి పోగా ఇంకా ఎన్ని మిగిలాయనే వివరాలు ఆరా తీస్తుండగా స్పష్టత రాలేదు. దీంతో మార్కెటింగ్ శాఖ విడుదల చేసిన టీఆర్ పుస్తకాలే కాక వ్యాపారులు కొందరు నకిలీ టీఆర్‌లను ముద్రించినట్లు గుర్తించారని సమాచారం. దీంతో పూర్తిస్థాయి లెక్కలు తేల్చడంపై దృష్టి సారించారు. ఈ వ్యవహారం జిల్లాలోని పలువురు ఉద్యోగులు, వ్యాపారుల్లో దడ పుట్టిస్తోంది.

త్వరలోనే వెల్లడిస్తాం..

ఈవిషయమై జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఎం.ఏ.అలీంను వివరణ కోరగా.. అన్ని అంశాలను పరిశీలిస్తున్నామని తెలిపారు. మొత్తం టీఆర్‌లు ఎన్ని, అందులో వ్యవసాయ శాఖకు ఇచ్చినవి, వినియోగించినవి పోగా మిగిలినవెన్నో తేలాల్సి ఉందని పేర్కొన్నారు. త్వరలోనే అన్ని వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

లాడ్జిలో వ్యక్తి ఆత్మహత్య


రవికుమార్ (ఫైల్)

సత్తుపల్లిటౌన్: ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి లాడ్జిలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం సత్తుపల్లిలో చోటుచేసుకుంది. ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్‌టీఆర్ జిల్లా పెనగంచిప్రోలుకు చెందిన తన్నీరు రవికుమార్ (34) తిరునాళ్లలో చేతులపై టాటూలు వేస్తూ.. కీ చైన్‌లు అమ్ముతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ క్రమంలో చేసిన అప్పులు తీర్చలేక మనస్తాపం చెంది సత్తుపల్లిలోని వేంసూర్ రోడ్‌లోగల ఓ లాడ్జిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమార్తెలున్నారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బైక్ అదుపుతప్పి యువకుడు దుర్మరణం

రఘునాథపల్లి: వరంగల్ – హైదరాబాద్ జాతీయ రహదారిలోని కోమళ్ల టోల్ ప్లాజా సమీపంలో బైక్ అదుపుతప్పి ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన జనగామ జిల్లాలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం గోకినపల్లి గ్రామానికి చెందిన గుంజులూరి ఉదయ్ (24) వరంగల్ నుంచి హైదరాబాద్‌కు ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. కోమళ్ల టోల్ ప్లాజా సమీపంలో ముందువెళ్తున్న వాహనాన్ని ఓవర్ టేక్ చేస్తున్న క్రమంలో అదుపుతప్పి రహదారి పక్కనే ఉన్న రెయిలింగ్‌ను ఢీకొట్టి.. అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ డి.నరేశ్ తెలిపారు.